కథ

"సుమిత్రా.."

**భర్తను ఆఫీసుకు సాగనంపుతూ గేటు దగ్గరే నిలబడిన సుమిత్ర ఉలిక్కిపడింది ఆ అరుపులాటి పిలుపుకి. నాలుగు అంగల్లో వంటింట్లోకి పరుగెత్తింది.**

# మారని మనసు

మనసులో కోపాన్నంతా కళ్ళల్లో ప్రతిఫలింప జేస్తూ కళ్ళెర్ర చేసింది మహాలక్ష్మమ్మ.

'ఎంతసేపు ఆ పకపకలూ..వంటింట్లో కూర మాడుతోందన్న ధ్యాస కూడా లేకుండా..'' హూంకరిస్తున్నట్టుగా అన్నది మహాలక్ష్మమ్మ.

అత్తగారి మాటలకి బాధగా అయిపోయింది సుమిత్ర మనసు. ఇపుడేగా కూర తరిగి స్టౌ మీద పెట్టింది. అపుడే ఏం మాడుతుంది అనుకుంది.

''ముసలిదాన్ని నీరసంతో ఛస్తున్నాను. త్వరగా టిఫిన్ తీసుకురా'' ఆర్డరేసి హాలులోకెళ్ళి కూర్చుంది మహాలక్ష్మమ్మ.

పదిసార్లు ఇల్లంతా తిరుగుతూనే ఉంటుంది. తన టిఫిన్ తను పెట్టుకోలేదూ..అనుకుంటూ టిఫిన్ పళ్ళెం, మంచినీళ్ళూ తీసుకెళ్ళి అత్తగారికందించింది సుమిత్ర. దర్జాగా టిఫిన్ ప్లేటు అందుకుంది మహాలక్ష్మమ్మ.

'ఇపుడు ఈవిడ కామెంట్స్ భరించాలి కాబోలు' తను చేసిన టిఫినుకి అత్తగారు పెట్టే వంకలు ఊహించుకుంటోంది సుమిత్ర.

''రుచి పచి లేదు. పోపు చాల్లేదు. ఇంకాస్త నూనె వేస్తే ఏం పోయింది. సంపాదించేది నా కొడుకేగా''

తను ఊహించినవన్నీ ఆవిడ నోటి వెంట ఆశువుగా వస్తుంటే ఉండబట్టలేకపోయింది సుమిత్ర.

''మీ అబ్బాయికి టిఫిన్ చాలా నచ్చిందట'' అన్నది.

ఆ మాటకే కయ్యిమంది మహాలక్ష్మమ్మ. ''అంటే నేను అబద్ధాలాడుతున్నాననా. నీ మొగుడిని కన్నతల్లిని నేను. తండ్రిలేని పిల్లాడిని పాతికేళ్ళు పెంచాను. వాడి ఇష్టాఇష్టాలు నాకు తెలీవా. నాకే ఎదురు చెప్పాలని చూస్తున్నావా''

సుమిత్ర మాట్లాడలేదు. ఇందులో అత్తగారికి తను ఎదురు చెప్పిందేమిటో తనకి అర్థం కాలేదు. కానీ ఒక్క విషయం మాత్రం బాగా అర్థమైంది తనకి. తనేం చేసినా అత్తగారు ఓ పట్టాన మెచ్చుకోదు. ఆవిడకి తనంటే అసూయా? కోపమా? లేకపోతే ఇదొక రకం శాడిజమా? పోనీ కట్నం చాలలేదనో, లాంఛనాలు సరిగా జరపలేదనో ఓ కారణం చూపించి సాధిస్తే వేరు. అకారణంగా ఇలా సాధించడంలో ఆవిడ అంతర్యమేమిటి? ఆవిడ ఎలా ప్రవర్తించినా తను మాత్రం ఆవిడపట్ల గౌరవంగానే మసలుతోంది. సాధ్యమైనంత వరకూ అన్నీ ఆవిడ ఇష్టప్రకారమే చేస్తుంది తను. ఆ యింట్లో అత్తాకోడళ్ల మధ్య గొడవలు వీధికెక్కకుండా ఉన్నాయంటే సుమిత్ర సర్దుకుపోయే మనస్తత్వమే కారణం.

★ ★ ★

మహాలక్ష్మమ్మకు ముగ్గురు కొడుకులు. పిల్లలు హైస్కూలు చదువుదాటకుండానే ఆమె భర్త కాలం చేశాడు. భర్త మిగిల్చిన ఆస్తితోపాటు ఆమెను కూడా లొంగదీసుకోవాలని ప్రయత్నించే మరదులూ, పిల్లలని చదివించాల్సిన బాధ్యతా, ఒంటరిగా ఎలా బతకాలో తెలియని పరిస్థితీ ఆమెలో భయాన్నీ, అభద్రతా భావాన్నీ పెంచి పోషించాయి. పరిస్థితులని బట్టి ఎలాటి మనిషైనా మారిపోతాడనడానికి మహాలక్ష్మమ్మ చక్కటి ఉదాహరణ. అప్పటివరకు మేకలాగా ఉన్న ఆమెను పులిలా మార్చింది ఆమెకెదురైన పరిస్థితులే. గుండెదిటవు చేసుకొని మొండి ధైర్యంతో పిల్లలని పెంచుకొచ్చింది ఆవిడ. కానీ అక్కడ కూడా ఆవిడకెదురు దెబ్బలే తగిలాయి. చదువైపోయి మంచి ఉద్యోగం రాగానే తమ కులంగాని అమ్మాయిని చేసుకొని దూరంగా ఎక్కడో స్థిరపడ్డాడు పెద్దకొడుకు. ఇక రెండోవాడికి చదువు సరిగా అబ్బలేదు సరిగదా కష్టించి పనిచేసే మనస్తత్వం కాదు అతడిది. పెళ్ళయితే దార్లో పడతాడని కట్నం కూడా ఆశించకుండా పేదింటి పిల్లని కోడలిగా చేసుకుంది మహాలక్ష్మమ్మ. పెళ్ళయిన కొడుకు దార్లోపడ్డాడు కానీ ఆ కోడలికే అత్త అంటే పడేది కాదు. పెళ్ళయి నెల తిరక్కుండానే భర్త చేత వేరు కాపురం పెట్టించింది రెండో కోడలు. పై ఇద్దరి కొడుకుల విషయంలో జరిగిన అనుభవంతో ఆవిడకి మూడో కొడుకు సుందరానికి పెళ్ళి చేయాలంటే భయం పట్టుకుంది. కానీ వయసొచ్చిన కొడుక్కి పెళ్ళి చేయకుండా ఎన్నాళ్ళు అట్టిపెట్టుకుంటుంది. అందుకే ఆమె ఒక నిర్ణయానికొచ్చింది. కొడుక్కి పెళ్ళి చేసినా ఆ కోడలిని తన అదుపాజ్ఞలలో ఉంచుకుంటే తన శేషజీవితం తన మూడో కొడుకు దగ్గర ప్రశాంతంగా గడిచిపోతుందని అనుకుంది మహాలక్ష్మమ్మ. ఆ క్రమంలో కోడలి మనసులో తను స్థానం కోల్పోతున్నానని గ్రహించుకోలేకపోయింది.

★ ★ ★

''మహాలక్ష్మమ్మగారూ..'' గుమ్మంలోంచి పిలుస్తోంది వర్ధనమ్మ. వర్ధనమ్మ అక్కడికి ఓ నాలుగిళ్ళ అవతల ఉంటుంది. ఆవిడకి, మహాలక్ష్మమ్మకి గుళ్ళో స్నేహం కలిసింది. అప్పుడప్పుడు ఒకరింటికి ఒకళ్ళు వెళ్ళి కబుర్లతో కాలక్షేపం చేస్తారు వాళ్ళు.

''రండి రండి ఈమధ్య కనిపించడం మానేశారు'' స్నేహితురాలిని లోపలికి ఆహ్వానించింది మహాలక్ష్మమ్మ. ''సుమిత్రా..రెండు కాఫీలు పట్రా'' ఆర్డరేసినట్టుగానే అరిచింది ఆవిడ.

''నువ్వు గొప్ప అదృష్టవంతురాలివి. కూతుర్లా చూసుకునే కోడలు దొరికింది'' కుర్చీలో కూర్చుంటూ అన్నది వర్ధనమ్మ.

గర్వంగా నవ్వుకుంది మహాలక్ష్మమ్మ. ''ఈ కోడల్నేం చూశావ్. నా పెద్దకోడళ్ళు ఇంకా బుద్ధిమంతులు. కాలు కిందపెట్టనివ్వరనుకో. నా పెద్ద కొడుకైతే మరీనూ. అమ్మా ఎప్పుడొస్తావంటూ ఉత్తరాల మీద ఉత్తరాలు రాస్తూనే ఉంటాడు. కానీ ఏం చేయను? వాళ్ళ ఊరి వాతావరణం నాకు పడదు. ఆ గాలికి, ఆ నీటికి ఆయాసం వస్తుంది నాకు'' లేని గొప్పలు చెప్పుకుంటోంది మహాలక్ష్మమ్మ. ఆ మాటల్లో నిజమెంతో ఆవిడకి తెలుసు.

'అన్నీ తెలిసి హిపోక్రసీలో బతుకుతూ తనని వంచించుకుంటూ ఎదుటివారిని కూడా వంచించాలని చూస్తారు ఎందుకో ఈ మనుషులు' అత్తగారి మాటలు విన్న సుమిత్ర మనసు భగ్గుమంది.

★ ★ ★

ఆరోజు ఆఫీసు నుండి హుషారుగా వచ్చాడు సుందరం.

''సుమీ త్వరగా తయారవు'' వస్తూనే హడావిడి చేశాడు.

''ఎక్కడికండి''

''మంచి సినిమా వచ్చిందోయ్. ఆఫీసులో మా ఫ్రెండ్స్ అందరూ చూశారు. చాలా బాగుందట''

ఆదుర్తి బాల



''తమరి హుషారుకి అదా కారణం. ఉండండి. పది నిమిషాల్లో వచ్చేస్తాం'' అంటూ లోపలికెళ్ళ బోతున్న భార్య చెయ్యి పట్టుకుని ఆపేశాడు సుందరం.

''వచ్చేస్తాం అంటున్నావేంటి'' అనుమానంగా అన్నాడు.

''నేనూ..అత్తయ్యా'' జవాబిచ్చింది సుమిత్ర.

''ఇంకా నయం అమ్మని పిలవలేదు. ఇది మనం చూసే సినిమా. అమ్మలాటి వాళ్ళకి సరిపడదు''

''కానీ ఆవిడ ఏమనుకుంటుందో'' భయంగా అన్నది సుమిత్ర.

''ఏమీ అనుకోదులే. నువ్వు త్వరగా తయారవు''

''ఇంకా వంట చేయలేదు. అత్తయ్య కూడా వస్తే సినిమా అయ్యాక ఏదైనా హోటల్లో తినేసి రావచ్చనుకున్నా''

''ఈ పూట అమ్మ వంట చేస్తుందిలే. రోజూ నువ్వే చేస్తున్నావు కదా''

''అదేదో మీరే చెప్పండి ఆవిడకి'' అన్నది సుమిత్ర. 'అసలే కయ్యానికి కారణం వెతుకుతూ ఉంటుందావిడ' అని మనసులో అనుకుంటూ.

తను, సమిత్రా సినిమాకెడుతున్నామనీ ఆ పూటకి తల్లినే వంట చేయమని చెప్పాడు సుందరం. అప్పటికి ఏం మాట్లాడలేదు మహాలక్ష్మమ్మ. కానీ అది తుపాను ముందర ప్రశాంతత అని తెలుసు సుమిత్రకి. సుమిత్ర ఊహించిన క్షణం రానే వచ్చింది. ఆ రోజు సుమిత్ర వంట గదిలోకొచ్చేసరికే మహాలక్ష్మమ్మ వంట ప్రయత్నం చేస్తోంది. అత్తగారి ప్రవర్తనకి కారణం ఊహిస్తూనే ''మీకెందుకత్తయ్యా శ్రమ. వంట నేను చేస్తానుగా'' అన్నది సుమిత్ర.

''అక్కర్లేదు'' విసురుగా అన్నది మహాలక్ష్మమ్మ.

సుమిత్ర ఆవిడ విసురుని పట్టించుకోకుండానే సౌమ్యంగా అన్నది- ''మీరు కూర్చోండి-వంట నేను చేస్తానన్నానుగా''

మహాలక్ష్మమ్మ కోపం తారాస్థాయికి చేరుకుంది. ''ఎంత నంగనాచిలా మాట్లాడుతున్నావే. ఈ గౌరవం నిన్న సినిమాకెళ్ళినప్పుడేమైంది. అయినా ఊరికే పడి తింటున్నానుగా. కాస్త పనిచేస్తే ఒళ్ళు అరిగిపోదులే'' గిన్నెలు ఎత్తి ఎత్తి పెట్టి చప్పుళ్ళు చేస్తోంది మహాలక్ష్మమ్మ.

''నిన్న వంట చేసే టైం లేదని ఊరుకున్నాను. ఇంక ఎప్పుడూ ఇంటి పనంతా మీకొదిలేసి నేను ఎక్కడికి వెళ్ళను లెండి''


''రేపోమాపో పోయేదాన్ని నాకోసం మీ సరదాలు మానుకోవడం ఎందుకులేమ్మా..నువ్వూ వాడూ సుఖంగా ఉండండి''

మహాలక్ష్మమ్మ మాటలలో వ్యంగ్యం అర్థంమైంది సుమిత్రకి. కొడుకు సుఖం కోసమేకదా కోడల్ని ఇంటికి తెచ్చుకుంటారు. మరి కొడుకూ, కోడలూ సుఖంగా ఉంటే ఈవిడకి బాధ ఎందుకో అర్థం కాలేదు సుమిత్రకి.

కాలగర్భంలో పదేళ్ళు దొర్లిపోయాయి. సుమిత్ర ఇద్దరు బిడ్డల తల్లి అయింది. వయసు మీద పడడంతోపాటు అపుడపుడూ చోటు చేసుకునే అనారోగ్యంతో మహాలక్ష్మమ్మ శారీరకంగా మార్పు చెందినా ఆవిడ ప్రవర్తన మాత్రం అలాగే ఉంది. సుమిత్రకి మాత్రం అత్తగారంటే విసుగొచ్చేసింది. అలాగని అత్తగారి సేవలో ఏనాడూ నిర్లక్ష్యం వహించలేదు. అత్తగారికి టైంకి భోజనం అమరుస్తుంది. కానీ అత్తగారికి ఆకలేస్తోందేమో పాపం అనే భావన కన్నా టైంకి అన్నం పెట్టాలి కదా అనే భావనే ఉంటుంది అందులో. ఆవిడకి జబ్బు చేసినప్పుడు

మందులేసినా, హాస్పిటలకి తీసుకె ళ్ళినా అందులో అత్తగారిమీద సాను భూతికన్నా కోడలిగా ఈ పని చేయడం నా విధి గనుకే చేస్తున్నాను అన్న భావనే కనిపిస్తుంది సుమిత్ర కళ్ళల్లో.

ఈ లేవలేని వయసులో కూడా కోడలు తనకి ఆమాత్రం కనిపెట్టు కుని ఉంటోందంటే అదంతా తను మొదట్నుంచీ కోడలిని తన అదుపాజ్ఞ లలో ఉంచుకోవడం వల్లేనని అనుకుం టుంది మహాలక్ష్మమ్మ.





కానీ తన అభిప్రాయం తప్పు అని తెలుసుకోవడానికి ఆమెకి ఎక్కువ రోజులు పట్టలేదు.

ఆరోజు భోజనమయ్యాక విశ్రాంతిగా పడు కుంది మహాలక్ష్మమ్మ. ముందు గదిలో కూర్చుని పక్కింటి ఆవిడతో లోకాభిరామాయణం మాట్లా డుతోంది సుమిత్ర.

వాళ్ళ సంభాషణలో తన ప్రస్తావన వచ్చేసరికి చెవులు రిక్కించి ఆసక్తిగా వినడం మొదలుపెట్టింది మహాలక్ష్మమ్మ.

''మా అత్తయ్య సంగతే తీసుకోండి. ఎంత చాకిరీ చేసినా తృప్తి ఉండదు ఆవి డకి. ఎప్పుడూ అథార్టీ చెలాయించా లని చూస్తుంది. మిగతా కొడు కులు ఎలాగూ చూడరు. ఆవిడ కున్న ఆధారం మేమే కదా. మాతో మంచిగా ఉంటేనే కదా మేమూ ఆవిడని మంచిగా చూసేది. కానీ ఆవిడకి ఆ జ్ఞానం లేదు'' అంటోంది సుమిత్ర.



''ఇన్ని సూటిపోటి మాటలన్నా నువ్వెలా సేవ చేయగలుగుతున్నావు ఆవి డకి'' అడుగుతోంది పక్కింటా విడ.

సుమిత్ర ఏం చెప్తుందో అని ఆత్రుత పెరిగిపోయింది మహాలక్ష్మ మ్మకి.

''ఇదంతా నా భర్తకిచ్చిన మాట కోసమే. నా భర్తకి తల్లి అంటే జాలి. తండ్రి లేని తమని ఎన్నో కష్టాల కోర్చి పెంచిందనీ, అందుకు ప్రతిగా తల్లికి జీవితాంతం ఏ లోటూ రాకుండా చూసుకోవడం పిల్లల బాధ్యతని మా పెళ్ళి అయిన మొదటి రాత్రే ఆయన చెప్పారు నాకు. తన అన్నయ్యలు ఎలాగూ తల్లిని పట్టించుకుంటారన్న ఆశ లేదు కాబట్టి ఆ బాధ్యతేదో తనే తీసుకుందామను కుంటున్నాననీ, అందుకు నా సహకారం కావాలని అన్నారు. ఆయన భార్యగా హక్కుతోపాటు ఆయన బాధ్యతలో పాలుపంచుకోవడం నా ధర్మంగా భావించాను కాబట్టే ఆవిడ మాటలని పట్టించుకోకుండా నా విధి నేను నిర్వర్తిస్తున్నాను''

వింటున్న మహాలక్ష్మమ్మ నివ్వెరపోయింది. తన మనోస్థితికి కారణం వెదికింది. ఆమెలో అంతర్మథనం మొదలైంది. ఇన్నాళ్ళూ కోడలు తనకనుగుణంగా మెలగడం తనంటే భయభక్తులతో కాదన్న మాట. కేవలం భర్తకిచ్చిన మాట నిలుపుకోవడం కోసమేనన్నమాట. అయినా తన మీద మిగతా కొడుకులకెవరికీ లేని దయా, జాలీ సుందరానికే ఎందుకు కలగాలి? తన ముగ్గురు కొడుకులనీ తను ఒకేలాగ పెంచింది కదా. ఆలోచిస్తున్న మహాలక్ష్మమ్మకి అనిపించింది. ప్రేమ, దయ అనేవి దైవస్వరూపాలు. ఆ గుణాలు అందరిలోనూ ఉండవు. ఆ గుణాలు పుణికి పుచ్చుకున్న సుందరం తన అదృ ష్టంకొద్దీ తన కొడుకయ్యాడు. అందుకే వాడి నీడలో తన శేష జీవితం హాయిగా గడిచిపోతోంది. కొడుకు కడు పుచించుకు పుట్టాడు కాబట్టి తల్లిమీద దయచూపించాడంటే అర్థముంది. మరి సుమిత్ర? తనవల్ల మాటలు పడు తున్నా తనకి అణిగి ఉండాల్సిన అవ సరం ఏమిటి తనకి? ఈ రోజుకి కూడా తన ఇష్టప్రకారమే ఆమె నడచు కుంటోందంటే ఆ గొప్పతనం తనది కాదు సుమిత్రదే... ఇన్ని విషయాలూ తెలుసుకోగలిగి తనెంత అహంకారంతో ప్రవర్తించింది.

ప్రేమతో సాధించాల్సిన గౌరవాన్ని కళ్ళగట్టి సాధిం చాలనుకుంది. అనురాగం చూపించాల్సిన చోట ఆధిపత్యం చెలాయించాలనుకుంది. తనకి కొడుకూ, కోడలి ప్రేమ కావాలి. తనకోసం వాళ్ళు చేసే ఏ పనైనా ప్రేమతో చేయాలి. అందుకు ముందర తను మారాలి. తన ప్రవర్తనని మార్చుకో వాలి. ఆలోచిస్తున్న మహాలక్ష్మమ్మ కోడలిని పిలి చింది. ఎదురుగా నుంచుంది సుమిత్ర. ఏం కావాల న్నట్టు చూసింది.

''నన్ను..నన్ను...ఇక నుండి అమ్మా..అని పిలు స్తావా సుమిత్రా'' అధికారం చూపడమే కానీ ఆప్యా యతని చూపడం తెలీని మహాలక్ష్మమ్మ కళ్ళు అభ్యర్థిస్తున్నాయి.

నమ్మలేనట్టు చూస్తోంది సుమిత్ర అలాగే. నిర్వి కారంగా బెడ్‌రూంలోంచి వచ్చాడు సుందరం- ''అమ్మ అడుగుతోందిగా పిలువు సుమిత్రా'' అన్నాడు.

''అమ్మా..'' నూతిలోంచి వచ్చినట్టు అస్ప ష్టంగా అన్నది సుమిత్ర.

మహాలక్ష్మమ్మ కళ్ళల్లో నీరు ధారాపాతంగా... మారిన ఆమె మనసుకి గుర్తుగా...

❀

## గుర్తింపు

**షాహీద్ వ్యవహారాన్ని పక్కనపెట్టమంటోంది కరీనాకపూర్. ఇంతకీ అసలు సగంతి ఏంటంటే ఆమె వెరైటీగా నటించిన 'చమేలీ' చిత్రం ఇప్పుడు వార్తల్లోకి వచ్చింది. ఈ చిత్రంలో ఆమె నటన చాలా బాగుందని విదేశీయులు కూడా మెచ్చుకుంటున్నా రట. ప్రీతీష్‌నందీ ప్రతిష్ఠాత్మకంగా నటించిన ఈ చిత్రం తొమ్మిదవ పుసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కి సెలెక్ట్ అయింది. దీంతో కరీనా ఎంతో ఆనం దంగా ఉందిట.**